స్థాపితము 1926 రిజిష్టర్ నెం 92

గోలకొండ పత్రిక

సంపాదకుడు: ఎన్.నరోత్తమరెడ్డి, ఎం.ఏ

సంపుటి 16 సంచిక 272 * హైదరాబాదు 17—10—1963 గురువారం * 4 పేజీలు 7 నయాపైసలు

1092243

శ్రీమతి అల్లూరి అన్నపూర్ణమ్మ

హైదరాబాద్, అక్టో 16

రాష్ట్రశాసన మండలికి ఏర్పడినఖాళీకి శ్రీమతి అల్లూరి అన్నపూర్ణమ్మ నామినేషన్ పత్రం నేడు దాఖలు చేయబడినది. వీరికి పోటీగామరే అభ్యర్థి నామినేషన్ పత్రాన్ని సమర్పించలేదు. ఈనామినేషన్ పత్రం స్క్రూటినీ అక్టోబరు 18 జరుగుతుంది. ఉపసంహరణకు తేదీ అక్టోబరు 21.

హైదరాబాదు బాలికకు బోస్టన్‌లో శస్త్రచికిత్స

వాషింగ్టన్ అక్టో 16

పుట్టుకనుండి హృదయలోప వ్యాధిలో బాధపడుతున్న 9 ఏండ్ల హైదరాబాద్ బాలికను బోస్టన్‌కు పంపి శస్త్రచికిత్స చేయడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి.

బోస్టన్‌లోని డీకోనెస్ ఆస్పత్రిలో డా॥ వెల్ ఫ్రెడ్ నెప్యూస్ ఈ శస్త్ర చికిత్సనుచేస్తాడు. బాలిక అక్టోబరు 29న బోస్టన్‌కు రప్పించబడుతుంది. ఆబాలికకు అమెరికాకు ఎయిర్ ఇండియా వారు ఉచితరవాణా సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు.

దక్షిణాది రాష్ట్రాలకై సూపర్ పవర్ గ్రిడ్ నిర్మాణం

పంచాయత్. సమితుల ఎన్నికలు:

బ్యాలెట్ పత్రాలపై 'మార్క్' చేసే పద్ధతి అమలుకు ప్రభుత్వ నిర్ణయం

హైదరాబాదు, అక్టోబరు16

వచ్చే సంవత్సరంలో వేలాది పంచాయతులకు సమితులకు ఎన్నికలుజరుగుతాయనీ బ్యాలెట్ పత్రాలపై "మార్కు" పద్ధతి అమలు జరపడానికి ప్రభుత్వం నిర్ణయించినదనీ ప్రణాళికా పంచాయత్‌రాజ్ మంత్రి డా॥ యమ్. చెన్నారెడ్డి నిన్న ఇక్కడ వెల్లడించారు.

పంచాయత్‌రాజ్ నిర్వహణాధికారుల రెండురోజుల ప్రాంతీయ సమావేశాన్ని పరిసమాప్తం చేస్తూ ప్రణాళికా మంత్రి ప్రసంగించారు.

సర్వసభ్య సమావేశాలలో ఎజెండాలో పేర్కొనబడిన అంశాలే కాకుండా, ఇక పైన పంచాయతులు మరియుజిల్లా పరిషత్తులు రెండు రోజుల పాటు తమ సంస్థలకు సంబంధించిన విషయాలపై చర్చించగలరని డా॥ చెన్నారెడ్డి పేర్కొన్నారు. పంచాయత్‌లు, జిల్లాపరిషత్తులు ఇంతవరకు స్వల్పకాల చర్చలు మాత్రమే జరిపేవారు.

పంచాయత్ రాజ్ పాలనాసిబ్బంది పనితీరును ప్రస్తావిస్తూ, బ్లాకు డెవలెప్‌మెంటు అధికారులు బి.డి.ఓ.-తమకు అప్పజెప్పబడిన పెక్కు విధులను నిర్వర్తించడంలో వెనుకబడరని డా॥ చెన్నారెడ్డి అన్నారు.

సిబ్బందికి బహుమతులు

సమితులకు, పరిషత్తులకుమాత్రమే ప్రోత్సాహకర విధానాలను వర్తింపజేయడం పరిమిత పర్చకుండా, తమ విధులను నిజాయతీతో, సమర్థవంతముగా నిర్వర్తించే పంచాయత్‌రాజ్ సిబ్బందికి సైతం అట్టి ప్రోత్సాహాన్ని విస్తృత పర్చాలని ఆయన అన్నారు.

పంచాయత్‌రాజ్ కమీషనరు శ్రీ అనంతరామన్ మాట్లాడుతూ, తమ తమ సంస్థలద్వారా మహోన్నతమైన సంఘసేవ చేస్తున్నందుకు పంచాయత్‌రాజ్ సిబ్బంది అదృష్టవంతులని అన్నారు.

కార్యవర్గం ఎన్నిక ఎకగ్రీవంగా జరగడానికిగాను పంచాయత్‌లకు బహుమతులు ప్రదానం చేయాలని "పంచాయత్"పై చర్చజరిపినగ్రూప్ సిఫారసు చేసింది.

ఖమ్మం జిల్లా పరిషత్తు అధ్యక్షులు శ్రీ బె. వెంగళ్‌రావు కృతజ్ఞతలు తెల్పారు.

పంచాయత్‌రాజ్ ప్రాంతీయ సమావేశం పరిసమాప్తి

రెండురోజుల పాటు జరిగిన పంచాయత్‌రాజ్ నిర్వహణాధికారుల ప్రాంతీయ సమావేశం నిన్న పరిసమాప్తమైనది నిన్న చర్చలు జరిపిన ఐదు గ్రూపులూ పెక్కు సిఫారసులు చేసినవి. ఈ సమావేశానికిముఖ్యమంత్రి సంజీవరెడ్డి ప్రారంభోత్సవం జరిపిన విషయం మా పాఠకులకు విదితమే.

ప్రథమ గ్రూపుకు నల్లగొండ జిల్లా పరిషత్తు అధ్యక్షులు శ్రీ జి. ఎన్. రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ గ్రూపు వ్యవసాయ సహకారం అను విషయాలపై పరిశీలన జరిపింది.

ఈక్రింది చర్యలను ఈ గ్రూపు సిఫారసు చేసినది: అందుపాటులో ఉండే విధంగా గోదాములలో ఎరువులు నిల్వలు ఉంచడ; సహకార సొసైటీల కొనుగోలు శక్తి పెంచడం అవసరం గల రైతులకు ఎరువులకు స్వల్పకాల ఋణాలు ఇవ్వడం; పీలుగా బైలాలను సడలించడం; స్థానికావసరాలు తీరే విధంగా వి.ఎల్.డబ్ల్యూలు ఉంచే సర్కిల్‌లో ప్రతి చోట కనీసం ఒక గోదాము నిలకొల్పడం.

ఉత్తమ ఫలితాలు చేకూరుతున, ప్రాంతాలకు యూరియా ఎరువులను

(చివరపేజి చూడుడు)

12 బ్రిటిష్ ఫైటర్ విమానాలు

లండన్, అక్టో 16

భారత విమాన రక్షణ వ్యవస్థకు తోడ్పడటానికి వస్తెందు బ్రిటిష్ విమానదళ ఫైటర్ విమానాలు తమెల చివరి భాగంలో భారతదేశానికి వస్తున్నాయి. ఇవి అక్టోబర్ 23, 27 తేదీలందు భారతదేశానికి చేరగలవు.

కస్తూర్బానిధి హైద్రాబాదు శాఖ

శ్రీమతి హెడా చే శ్రీమతి దమయంతికి అప్పగింత

హైదరాబాద్, అక్టో 16

కస్తూర్బా స్మారక ధర్మకర్తృత్వ నిధి హైదరాబాద్ శాఖ అధికారాన్ని శ్రీమతి జ్ఞానకుమారి హెడా నిన్న తిరువూరుకు చెందిన ప్రముఖ సర్వోదయ సేవకురాలు శ్రీమతి బి. దమయంతిదేవికి అందజేశారు.

1945లో కస్తూర్బా నిధి ఏర్పాటు చేసినప్పటినుండి శ్రీమతి హెడా రాష్ట్ర ప్రతినిధిగా ఉంటూ వచ్చారు. రెండేండ్ల క్రితమే ఆమె రాజీనామా ఇచ్చారు గాని ఆ బాధ్యత స్వీకరించే వారు మరొకరులభించేవరకూ పదవిలో ఉండాల్సిందిగా ఆమెనుకోరారు. నిన్న శ్రీమతి హెడాఇంట ప్రభాకర్జీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నిధి బాధ్యతలు శ్రీమతి దమయంతికి అప్పగించబడ్డాయి.

భారతదేశానికి 40 లక్షల పౌన్లు అప్పు

బ్రిటన్‌తో ఒప్పందంపై సంతకాలు

న్యూఢిల్లీ, అక్టోబర్ 16

భారత ప్రభుత్వానికి బ్రిటిష్ ప్రభుత్వం 40 లక్షల పౌనులు [రూ. 5.33 కోట్లు] అప్పుఇవ్వటానికి సంబంధించిన ఒప్పందం మీద ఉభయ ప్రభుత్వాల మధ్య ఈవేళ సంతకాలు జరిగాయి.

బ్రిటిష్ హైకమిషనర్ సర్ పాల్ గోర్‌బూత్, భారత ప్రభుత్వ ఆర్థిక మంత్రిత్వ శాఖలో ఆర్థిక వ్యవహారాల విభాగం కార్యదర్శి శ్రీ పి.గోవిందన్ నాయర్ సంతకాలు చేశారు.

భారతదేశంలో తృతీయ పంచవర్ష ప్రణాళిక కింద కొనసాగే ఆర్థికాభివృద్ధికి అయ్యే విదేశ మారకపుఖర్చుల క్రింద 1963 - 64 కి బ్రిటిష్ ప్రభుత్వం వాగ్దానం చేసిన 300 లక్షల పౌనుల డబ్బులో [రూ॥ 40 కోట్లు] యిది చేరి వుంది. భారత దేశానికి సహాయం చేయదలచిన దేశాల సముదాయం ఇటీవల ప్యారిస్, వాషింగ్‌టన్ నగరాలలో జరిపిన సమావేశాల్లో బ్రిటన్ ఈవాగ్దానం చేసింది.

ఈ అప్పు ను పాతికేళ్ళలో చెల్లించాలి. మొదటి ఏడేళ్ళు యీ అప్పు క్రింద "అసలు" డబ్బు చెల్లించ వలసిన అవసరం లేదు. బ్రిటన్‌లో కామన్ వెల్తు వ్యవహారాల కార్యదర్శి జులై 17 న బ్రిటిష్ పార్లమెంటులో చేసిన వాగ్దానం ప్రకారం ఈ యేడేళ్ళూ ఈ డబ్బుకు వడ్డీ గూడా తీసుకోరు.

బ్రిటన్ నుంచి సాంప్రదాయముగా సప్లయ్‌లను తెప్పించుకుంటూ, విదేశ మారకం విషయంలో భారత దేశము గడ్డు పరిస్థితిని యెదుర్కోడము మూలకంగా ఇబ్బందులకులోనౌతున్నఉత్పత్తి దారుల నిర్వహణశక్తిని పెంపొందించటానికి ఈ డబ్బును వినియోగిస్తారు. ఇందుకు గాను ఆర్థిక సహాయం చేయవలసిన అవసరముందని బ్రిటిష్ పరిశ్రమల సమాఖ్య డైరెక్టర్ జనరల్ సర్ నార్మన్ కిప్పింగ్, బ్రిటిష్ అధికారులకూ, భారతీయ అధికారులకూ విశదీకరించారు. సర్ నార్మన్ కిప్పింగ్ ఈ సంవత్సరారంభములో భారత దేశములో పర్యటించారు.

ఈ పథకాన్ని అమలుపరచే బాధ్యత భారత ప్రభుత్వపు దిగుమతుల ప్రధాన కంట్రోలరుదై వుంది. ఈ అప్పుక్రింద అవసరమైన అదనపుదిగుమతి లైసెన్సులను ఈయనే మంజూరు చేస్తారు.

యుద్ధవిరమణకై బోర్గిబా విజ్ఞప్తి

ట్యూనిస్‌లో అల్జీరియా, మొరాకో విదేశాంగ మంత్రుల చర్చలు ఏర్పాటు

ట్యూనిస్, అక్టో 16

అల్జీరియా- మొరాకో సరిహద్దుల్లో తక్షణమే యుద్ధవిరమణ జరపాలిస్తిగా అల్జీరియా అధ్యక్షుడు అహ్మద్ బెన్ బెల్లాకు, మొరాకో రాజు హాసన్‌కు గతరాత్రి ట్యునీషియా అధ్యక్షుడు హాబీబ్ బోర్గిబా తంతి ద్వారా విజ్ఞప్తులు పంపాడు:

సంఘర్షణకు దారితీసే సైనిక కేంద్రీకరణను మానివేయవలసిందనీ ట్యునీస్‌లో జరుపదలచిన ప్రత్యేక సమావేశానికి విదేశాంగ మంత్రిల్ని పంపించాల్సిందనీ కూడా హాబీబ్ బోర్గిబా అన్నాడు.

కాంపౌండర్ల (సప్లిమెంటల్) పరీక్షా ఫలితాలు

హైదరాబాదు, అక్టో 16

1963 సెప్టెంబరులో విశాఖపట్నంలోని ఆంధ్ర వైద్యకళాశాలలో జరిగిన ప్రభుత్వ కాంపౌండర్ల (సప్లిమెంటల్) పరీక్షలో ఉత్తీర్ణులైనట్లు ప్రకటించబడిన అభ్యర్థుల రోల్ నెంబర్ల తాత్కాలిక జాబితా దిగువ ఇవ్వబడింది:- 1,2,4,6,నుండి 12,15 నుండి 23,25 నుంచి 29.

అఖిలభారత మద్యనిషేధ కార్యకర్తల సభలు

హైదరాబాద్, అక్టోబరు 16

డిసెంబరు 21 వ తేదీనుండి అఖిలభారత మద్యనిషేధ కార్యకర్తల సభలు ఇక్కడ రెండురోజులపాటు జరుగుతవి.

కేంద్ర ప్రభుత్వ మాజీ ఆర్థిక మంత్రి మొరార్జీ దేశాయి ఈ సభలకు అధ్యక్షత వహిస్తారు రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎన్. సంజీవరెడ్డి ప్రారంభోత్సవం చేస్తారు. కె. కామరాజ్‌కు మద్రాసు మైసూర్ ముఖ్యమంత్రులకు ఆహ్వానాలు పంపబడినవి.

వచ్చే సంవత్సరం రాష్ట్రాల ప్రణాళికా వ్యయం

న్యూఢిల్లీ, అక్టోబర్ 16

1964-65 లో రాష్ట్రాల ప్రణాళికా వ్యయం రు. 850 కోట్లు ఉంటుంది. ఇది వర్తమాన సంవత్సరం కన్నా రు. 100 కోట్లు అధికం.

మూడవ ప్రణాళిక యొక్క నాల్గవ సంవత్సరంలో రాష్ట్రాలకు కేంద్ర పథకం రు. 500 కోట్లుంటుంది. మిగతా రు. 350 కోట్లు రాష్ట్రాలు స్వయంగా సంపాదించుకోవాలి.

28 న బెంగ్లూర్‌లో ప్రతిపాదన పరిశీలన

ఈ విధానంవల్ల 265 వేల కిలోవాట్లు విద్యుచ్ఛక్తి లభ్యమయ్యే అవకాశం

న్యూఢిల్లీ, అక్టోబర్ 16

బెంగ్లూరు ఈ నెల 28 న జరిగేఉన్నతస్థాయిసమావేశంలో దక్షిణ ప్రాంతానికై సూపర్ పవర్ గ్రిడ్ ఏర్పాటు గూర్చి చర్చ జరుగుతుంది. ఈ సమావేశానికి కేంద్ర ఇరిగేషన్ విద్యుచ్ఛక్తి మంత్రి డాక్టర్ కె. ఎల్. రావుఅధ్యక్షత వహిస్తారు. ఆంధ్ర, మద్రాస్, మైసూర్, కేరళరాష్ట్రాల విద్యుచ్ఛక్తి మంత్రులు ఈ సమావేశానికి హాజరవుతున్నారు. ఈనాల్గు రాష్ట్రాలు తమ విద్యుచ్ఛక్తి వ్యవస్థలను పరస్పరము కలుపడానికి అంగీకరించారు. ఈబెంగ్లూర్ సమావేశంలో పరిపాలనా విషయాలు గూడా చర్చకు వస్తాయి. సూపర్ గ్రిడ్ నిర్మాణంతో ప్రాంతీయ ఏజెన్సీ స్థాపన ఇతర సాంకేతిక అంశాల గూడా పరిశీలింగవలసిఉంటుంది.

కేరళ, మద్రాస్ మరియు మద్రాస్ మైసూర్, మద్రాస్ ఆంధ్ర మధ్య 220 కిలోవాట్ సింగిల్ సర్క్యూట్ లైను ఏర్పరచబడుతుంది. ఈ చాల్లు రాష్ట్రాల విద్యుచ్ఛక్తి పరఫరా వ్యవస్థల కలిపిన 235 వేల కిలోవాట్లవిద్యుచ్ఛక్తి అదనంగా లభిస్తుంది. ద్రవ్య రూపంలో దీనిని లెక్కకట్టాలంటే రు. 22.78 కోట్లు పెట్టుబడి వ్యయంలోను రు. 2.61 కోట్లుసాలీనానిర్వహణ ఖర్చు రూపంలోను మిగులుతుంది.

ఇదే విధంగా పంజాబ్, ఢిల్లీ, యు. పి. రాష్ట్రాలు తమ విద్యుచ్ఛక్తి వ్యవస్థల కలుపడానికి అంగీకరించాయి. వీనిని కలుపడమువల్ల లక్ష కిలోవాట్ల విద్యుచ్ఛక్తి అదనముగా లభిస్తుంది. పెట్టుబడి ద్రవ్య రూపంలో రు. 9.65 కోట్లు సాలీనా నిర్వహణ వ్యయంలో రు. 1.46 కోట్లు మిగులు సాధ్యమవుతుంది.

ఇదేవిధంగా యు. పి. రాజస్థాన్ బిహార్, గుజరాత్‌ల విద్యుచ్ఛక్తి వ్యవస్థల కలుపడానికి ప్రతిపాదన కలదు.

అల్జీరియా- మొరాకోల మధ్య పోరాటం

మరాకష్, అక్టో 16

వివాదగ్రస్తమైన సరిహద్దు లోని ఎడారిప్రాంతమందు అల్జీరియా, మొరాకో సైన్యాలు నేడు పోరాడినవి. మొరాకో సైనికులు నాల్గువేల మంది నేటి పోరాటంలో పాల్గొన్నారట.

జగదీష్ రాత్రిపాఠశాల నూతన కార్యవర్గం

హైదరాబాదు, అక్టో 16

జగదీష్ రాత్రి పాఠశాల సర్వసభ్య సమావేశం అక్టోబరు 10 న జరిగినది. నారాయణగూడా మండల్ కాంగ్రెస్ కమిటీ మాజీ ప్రధాన కార్యదర్శి శ్రీ టి. పాపిరెడ్డి అధ్యక్షత వహించారు. 1963-64 సంవత్సరానికి ఈ క్రింది కార్యవర్గం ఎన్నికైనది.

అధ్యక్షులు యమ్. ఊశయ్య, ఉపాధ్యక్షులు యమ్. ఏ రహీమ్, ప్రధాన కార్యదర్శి ఎ. పి. మల్లేశం, కోశాధికారి కె. రాజయ్య, సహాయ కార్యదర్శి ఎ. రాజనర్సింహ, మరి కొందరు సభ్యులు కూడా ఎన్నికైనారు.

అమృతసరులో పాకిస్తానీల అరెస్టు

అమృతసర్, అక్టో 16

అమృతసర్ నగర ప్రధాన వ్యాపార కేంద్రంలో నిన్న ముగ్గురు పాకిస్తానీ జాతీయులు అరెస్టు చేయబడ్డారు.

పార్కు నుండి చిరుతపులి మాయం

హైద్రాబాదు, అక్టో 16

మీరాలం చెర్వువద్ద ఏర్పరచిన జంతు ప్రదర్శనశాలలో ఉంచబడిన చిరుతపులి ఒకటి తప్పించుకొని పోయింది.

ఈ చిరుతపులి అచోకీ తీయడానికి పోలీసువారు. జంతు ప్రదర్శనశాలవారు చేసిన కృషి ఇంతవరకు ఫలించలేదు.

పంజాబ్‌లో కమ్యూనిస్టు డిటెన్యూల విడుదల

చండీఘర్, అక్టో 16

భారత రక్షణ నిబంధనల క్రింద డిటెన్షన్‌లో ఉంచబడిన 24 మంది కమ్యూనిస్టుల విడుదలకు పంజాబ్ ప్రభుత్వం ఉత్తర్వు చేసింది.

మొరాకో సరిహద్దు ప్రాంతాలపై బాంబింగ్

రాబత్, అక్టో 16

మొరాకో సరిహద్దు ప్రాంతాలగు బెల్మోబాద్ గైర్‌లపైఅల్జీరియా విమానం ఒకటిబాంబుల వేసిందని మొరాకో సమాచార మంత్రాంగం నేడు తెలిపింది.

జాతీయ సమైక్యతా సాధన దినోత్సవం

దేశ వ్యాప్తంగా నిర్వహణ

న్యూఢిల్లీ, అక్టోబరు 16

భారతజాతి యావత్తూ అక్టోబరు 20 వ తేదీన జాతీయ సమైక్యతా సాధన దినం జరుపుకుంటుంది. క్రిందటి సంవత్సరం అక్టోబరు 20 వ తేదీనే చైనా భారతదేశంపై భారీ దండయాత్ర జరిపింది. ఈ సందర్భంలో ప్రధాన మంత్రి శ్రీ జవహర్‌లాల్ నెహ్రూ ఆ క్రితం రోజు సాయంత్రం భారత ప్రజలనుద్దేశించి రేడియోలో ప్రసంగిస్తారు. ఆ రోజున ఉదయం ప్రభాత్ ఫేరీలు, ప్రార్థనలు, బెడా ప్రతిష్ఠాపనలు జరుగుతాయి. దేశ వ్యాప్తంగా బహిరంగ సభలు ఏర్పాటు చేస్తారు. ఆ సభలలో ప్రజలందరూ ఈ క్రింది ప్రతిజ్ఞ తీసుకుంటారు.

"సమరం ఎంత కష్టమైనా, ఎంత దీర్ఘమైనా, ఎన్నెన్ని పెద్ద త్యాగాలు చేయవలసి వున్నప్పటికీ, నా మాతృదేశ స్వాతంత్ర్యాన్నీ, సమైక్యతనీ పరిరక్షిస్తామని ప్రజలు పట్టిన దీక్షకు, మనోవాక్కాయ కర్మల ఇదినా దక్షత.

నా జాతి శక్తి స్తోమతలూ, ఐక్యమత్యమూ, పెంపొందించటానికి దృఢ సంకల్పంతో శక్తి లోపంలేక కృషి చేస్తానని ఇది నా ప్రతిజ్ఞ".

ఆ రోజు సాయంత్రం ప్రస్తు ప్రదర్శనలు, పక్క ప్రదర్శనలూ, ఆటలు సాంస్కృతిక కార్యక్రమాలూ నిర్వహిస్తారు. ఆట్టు పాఠశాలలలోనూ, కళాశాలలలోనూ, ప్రత్యేక కార్యక్రమాలుంటాయి. జాతీయ సైనిక విద్యార్థి దళం, హోంగార్డ్సు దళం, గ్రామ వలంటీరు దళం, స్కౌట్సు, గైడ్సు ఆ రోజున ప్రత్యేక సైనిక కవాతులు చేస్తారు.

దేశంలో బొగ్గు ఉత్పత్తి

ఏప్రిల్ నుంచిఆగస్టువరకువివరాలు

న్యూఢిల్లీ, అక్టో 16

బొగ్గు ఉత్పత్తి విషయములో 1963-64కు నిర్ణయించుకున్న లక్ష్యం ప్రకారమే ఉత్పత్తి జరుగుతున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దేశంలో 99.4 లక్షటన్నుల బొగ్గునుఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

ఈపదు ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు మొత్తం 277.8 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి అయింది. క్రిందటేడు యిదే కాలంలో 247.9 లక్షలటన్నులబొగ్గు ఉత్పత్తి అయింది. ఈ విధంగా బొగ్గు ఉత్పత్తి జరిగితే నిర్ణీతలక్ష్యాన్ని సాధించవీలౌతుందని ఆశిస్తున్నారు.

దేశంలో అవసరాలకు మించిబొగ్గు ఉత్పత్తిఅవుతున్నదనీ అందుచేతబొగ్గు కొరత యేర్పడటంఅన్న ప్రశ్నేలేదనీ, యిటీవల అందాలబట్టి తెలుస్తున్నది. వినియోగదారుల అవసరాలను తీర్చేట్లుగా ఈ బొగ్గును రవాణా చేయటానికిగూడా తగిన సౌకర్యాలు లభిస్తున్నాయి.

రైల్వేలుబాగా వాగన్లను సప్లయ్ చేస్తున్నాయి. కలియేడు ఆగస్టు నెలలో రోజూ సరాసరిన 69.9 వాగన్లలో బొగ్గును నింపారు. ముఖ్యమైన వినియోగదారులందరికన్నా ఇప్పుడు బొగ్గు నిల్వలు తగినంతగా వున్నాయి.

పంచాయత్ బోర్డు అధ్యక్షుని హత్య

కొత్తగూడెం, అక్టోబరు 16

ఇక్కడికి 16 మైళ్ళ దూరంలోగల ఏనుకూరు పంచాయత్ బోర్డు అధ్యక్షులు కె. సుబ్బయ్యను గత రాత్రి ఎవరో తుపాకితో కాల్చి చంపారు.

కలకత్తాలో లాఠీఛార్జి, బాష్పవాయుప్రయోగం

బియ్యాన్ని మణుగు రు. 22 కు అమ్మాలని డిమాండు

కలకత్తా, అక్టోబర్ 16

ఉత్తర కలకత్తాలో సోవాబజార్ ప్రాంతమందు ఒక బియ్యపు గోదాము వద్ద ప్రజా సమూహాన్ని చెదరగొట్టడానికి పోలీసులు లాఠీ చార్జి చేశారు. తొలుత బాష్పవాయువును ప్రయోగించిన ప్రయోజనం లేకపోయినందువల్ల లాఠీఛార్జి చేశారు. ప్రజాసమూహము రు. 35 కు మణుగుబియ్యంకాకుండా రు. 22 కు మణుగు కొప్పున అమ్మాలని కోరారట.

సైనిక విద్యార్థులకు విద్యార్థివేతన పథకం

పాలకమండలి సిఫార్సు

న్యూఢిల్లీ, అక్టో 16

సైనిక పాఠశాలల విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వాలువిద్యార్థి వేతనాలు మంజూరు చేసేందుకు ప్రాతిపదికగా వుండే ఒక నమూనా పథకాన్ని సైనిక పాఠశాలల పాలక మండలి ఆమోదించింది. ఈపథకాన్నిఅమలుజరుపవలసినదని వివిధ రాష్ట్ర ప్రభుత్వాలకు ఈ మండలి సిఫార్సు చేసింది. నిన్న యిక్కడ ఆఖరైన ఈ మండలి సమావేశానికి రక్షణ మంత్రి, శ్రీ వై.బి. చ్యవన్ అధ్యక్షత వహించారు.

ఇంతవరకూ దేశములో 18 సైనిక పాఠశాలలనునెలకొల్పారు. ఆకేంద్రాలివి: సతారా, కుంజ్‌పూర్, జామ్‌నగర్, కపూర్తలా, చిత్తోడ్‌గఢ్, కోరుకొండ, తిరువనంతపురం, పురూలియా, భువనేశ్వర్, అమరావతీనగర్, క్రోయంబత్తూరు)లేవా, బీజాపూర్, తిలయ్యా.

సైనిక పాఠశాలలలో ప్రాంతీయ భాషల బోధనకు చేయదగుఏర్పాట్లను గురించీ, పాఠశాలా భవనాల నిర్మాణములో ప్రగతిని గురించీ కూడా యీ సమావేశంలో చర్చలు జరిగాయి.

కేరళతీరప్రాంతానికి సముద్రపు పోటునుంచి రక్షణ

న్యూఢిల్లీ, అక్టోబర్ 16

సముద్రపు పోటువల్ల కేరళ తీరప్రాంతంలో భూముల మునకను నివారించేందుకు తీసుకోదగు చర్యలను గురించి కేంద్ర సేద్యపు, నీటి సౌకర్యాల, విద్యుచ్ఛక్తి విషయాల మంత్రి డాక్టర్ కె.ఎల్. రావు రేపు కేరళ రాష్ట్ర ముఖ్యమంత్రితో చర్చలుజరుపుతారు.

అమెరికన్ నిపుణుడు శ్రీ వాట్స్ యీ చర్చలలో పాల్గొనే నిమిత్తము తక్షణమే తిరువనంతపురం వెళ్ళారు. ఆయన ఈ సమస్యను సర్వంకషంగా పరిశీలించి ప్రభుత్వానికి సిఫార్సులు చేస్తారు. శ్రీ వాట్స్ మన దేశములో ఆరు వారాలపాటు ఉంటారు.

వీలైనంత స్వల్పకాలంలో ఈ సమస్యను పరిష్కరించేందుకు వీలుగా, సద్యోఫలితాలనిచ్చే ఆధునిక శాస్త్రీయ పద్ధతులను సూచించడానికి యీ అమెరికా నిపుణుని ప్రత్యేకముగా భారత దేశానికి ఆహ్వానించారు.

కేరళ రాష్ట్ర తీరప్రాంతం నిడివి దాదాపు 350 మైళ్లు. అందులో 200 మైళ్ళ నిడివైన ప్రాంతంలో రక్షణ చర్యలు తీసుకోవలసివుంది. రు. 26 కోట్ల వ్యయంతో సముద్ర తీరం పొడుగునా దాదాపు 200 మైళ్ళ నిడివైన గోడను నిర్మించేందుకు ఒక దీర్ఘకాలిక ప్రణాళికను రూపొందించారు. కేరళ తీరప్రాంతానికి సముద్రపు పోటునించి రక్షణ కల్పించే కార్యక్రమాన్ని పూర్తి చేసేందుకు తృతీయ ప్రణాళికా కాలం ప్రారంభం నుంచి సుమారు 30 ఏళ్ళు పడుతుంది.

కేన్సర్ వ్యాధికి మరోమందు

టోకియో, అక్టో 16

మలేరియా మరియు కీళ్ళ నొప్పుల వ్యాధి నిర్మూలనకు వాడే ఒక ఔషధి కేన్సర్ వ్యాధి పెరుగుదలను విజయవంతముగా అరికట్టగలదని జపాన్ రీసర్చి సైంటిస్టులు పశ్చిమ జపాన్‌లోని ఓకాయామాలో ప్రకటించారు.

జూనియర్ కబడ్డీ చాంపియన్ షిప్ పోటీలు

హైదరాబాదు, అక్టో 16

నేడు జరిగిన రెండు ఆటలలో మొదటి ఆటయందు ఆర్యన్ విజిల్ నగర్ 4 పాయింట్లతో నవయుగ సంఘం కాచిగూడపై గెల్చింది. స్కోరు 7-3. రెండవఆటలో పాల్తు లీగ్ ఆర్.టి.అస్.సి.పై 27 పాయింట్లతో గెల్చింది. స్కోరు 46-19 రేపు సాయంత్రము 5-45కు జరుగబోయే పోటీలో మొదటి ఆట నవయువక సంఘంకాచికూడా ఆర్.టి.అస్.సి మధ్యన రెండవ ఆట 6-30 గంటలకు శాంతిక్లబ్ పాల్తులీగ్ మధ్య జరుగుతుంది.

బట్టల వర్తకునికి జరిమానా

హైదరాబాదు, అక్టో 16

శ్రీకాకుళం జిల్లా తక్కలిలోని కొలతలు,తూకాలఇన స్పెక్టరు 1955వ సం.పు ఆంధ్ర ప్రదేశ్ కొలతలు, తూకాలచట్టం ఉల్లంఘన నేరానికి తక్కలిలో ఒక బట్టలవర్తకునిపై కేసు పెట్టారు.

సోంపేట అదనపుజిల్లా మున్సిఫ్ మెజిస్ట్రేట్ వర్తకునికి 100 రూ. జరిమానా విధించారు.

వచ్చే సంవత్సరం రాష్ట్రాల ప్రణాళికా వ్యయం

న్యూఢిల్లీ, అక్టోబర్ 16

1964-65 లో రాష్ట్రాల ప్రణాళికా వ్యయం రు. 850 కోట్లు ఉంటుంది. ఇది వర్తమాన సంవత్సరం కన్నా రు. 100 కోట్లు అధికం.

మూడవ ప్రణాళిక యొక్క నాల్గవ సంవత్సరంలో రాష్ట్రాలకు కేంద్ర పథకం రు. 500 కోట్లుంటుంది. మిగతా రు. 350 కోట్లు రాష్ట్రాలు స్వయంగా సంపాదించుకోవాలి.

ఆంధ్రకు చందనపు చెక్క దొంగరవాణా

హైదరాబాద్, అక్టో 16

గుంటూరుకు 10 మైళ్ళ దూరంలోగల యెనుమద్ల గ్రామమువద్ద గుంటూరుకు తేబడుతున్న ఒక టన్ను చందనపు చెక్కను అటవీ శాఖవారు పట్టుకున్నారు. ఇది చెన్నపట్నం రోడ్డులో తేబడుచుండెను. గుంటూరులోని 8 ఇండ్లలో రు. 40 వేల విలువచేసే దాదాపు 8 టన్నుల చందనపుచెక్కను గూడా ఈఅటవీశాఖ అధికారులు పట్టుకున్నారు.

మద్రాస్, మైసూర్ రాష్ట్రముల అడవుల నుండి పొరుగు రాష్ట్రాలకు చందనపు చెక్కను దొంగరవాణాచేసే ఒకజట్టు పనిచేస్తున్నది. ఇప్పటి వరకు ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ స్థలాలలో ఇట్టి సరుకు రు. 60 వేల విలువగలది పట్టుకోబడినది.

జపాన్‌కు ఇనుప ఖనిజం ఎగుమతి

టోకియో, అక్టో 16

వచ్చే సంవత్సరం దక్షిణ అమెరికా నుండిగాని గోవానుండిగాని 7 లక్షల టన్నుల ఇనుపఖనిజాన్ని జపాన్ ఉక్కు మరియు ఇనుప పరిశ్రమను దిగుమతి చేసుకొన నిర్ణయించినది.

కొత్తగూడెం పవర్ హౌస్ కార్మికుల ఆక్షేపణ వారం

కొత్తగూడెం, అక్టో 16

సింగరేణి కాలరీస్ మజ్దూర్ సంఘం ఇచ్చిన పిలుపు ననుసరించి కొత్తగూడెంలోని సింగరేణి కాలరీస్ పవర్ హౌస్ కార్మికులు 200మందినేటినుండి ఆక్షేపణ వారాన్నిజరుపుతున్నారు.

వార్తా పత్రికలకు న్యూస్‌ప్రింటు కేటాయింపు

విధానంలో మార్పులు

న్యూఢిల్లీ, అక్టోబరు 16

వార్తా పత్రికలకు యితర పత్రికలకూ 1963 ఏప్రిల్-సెప్టెంబరు కాలంలోని న్యూస్‌ప్రింటు కేటాయింపు పరిస్థితిని జాగ్రత్తగా సమీక్షించిన తర్వాత, దిన పత్రికలపై (ఆదివారపు అనుబంధాలతోసహా) విధించిన పేజీల తగ్గింపును కొంతవరకూ పునరుద్ధరించడానికి యిప్పుడు వీలైనదని కేంద్ర సమాచార రేడియో మంత్రిత్వశాఖ నేడొక పత్రికా ప్రకటనలో తెలియచేసింది. ఆ ప్రకటనలో యింకా యిలా వుంది: "మధ్యరకం దిన పత్రికల సర్క్యులేషన్‌ను పెంచడానికి కూడ అవకాశం కల్పించారు.

ప్రస్తుత లైసెన్సింగు కాలం మొదట్లో దిన పత్రికల (ఆదివారపు అనుబంధాలతోసహా) పై విధించిన పేజీల తగ్గింపు 1963 అక్టోబరు 1 వ తేదీనుంచి నిలిపివేయడమైనది. పదివేల నుంచి ఏభై వేల సర్క్యులేషనుగల దిన పత్రికలు [ఆదివారపు అనుబంధాలతోసహా] 1963 అక్టోబరునుంచి 1964 మార్చి కాలానికి 1961-62 నాటి సర్క్యులేషను పై నూటికి 20 వంతులు, 50 వేల ప్రతులకు మాత్రం మించకుండా, పెంచడానికి అనుమతించడమైనది.

అదనపు న్యూస్‌ప్రింటు కోటాలకు అర్హతగల వార్తా పత్రికల సంస్థలు తమ దరఖాస్తులను పత్రికల రిజిస్ట్రారు కార్యాలయానికి 1963 నవంబరు 30 వ తేదీలోగా పంపాలి. సవరించిన యీ విధానం వివరాలతోసహా కేంద్ర అంతర్జాతీయ వ్యాపారశాఖ వేరొక ప్రకటన జారీచేసింది.

నాసర్-సిరిమావో సూచన

నేపాల్ వర్గాల సమాహ్వానం

ఖాట్మండు, అక్టో 16

ఐక్యఅరబ్‌రిపబ్లికు అధ్యక్షుడు నాసర్, సింహళప్రధానమంత్రిణి సిరిమావో బండారునాయకే కలిసి ప్రకటన చేస్తూ రెండవసారి తటస్థరాజ్యాల సమావేశం జరగాలని చేసిన సూచనను నేపాల్ వర్గాల వారాహ్వానించారు.

తటస్థ పద్ధతి మంచిది, మంచి పనులను నేపాల్ బలపరుస్తుంది అని అధికార వర్గాలు తెలిపారు.

గవర్నర్ల వార్షిక సమావేశం

న్యూఢిల్లీ, అక్టోబరు 16

అక్టోబరు 31 మరియు నవంబరు మొదటితేదీలందు జరిగే గవర్నర్ల వార్షిక సమావేశంలో రాజకీయ ఆర్థిక సమస్యలు చర్చింపబడుతవి.

ఈ వార్షిక సమావేశాన్ని రాష్ట్రపతి డాక్టరు రాధాకృష్ణన్ ప్రారంభిస్తారు. ప్రధాని నెహ్రూ అంతర్జాతీయ పరిస్థితులపై ప్రసంగిస్తారు. రక్షణ మంత్రి దేశ రక్షణ సన్నాహాలపై ప్రసంగిస్తారు.

నేపాల్ నుండి కలప

భారతరైల్వే మంత్రిత్వశాఖ అధికారుల చర్చలు

ఖాట్మండు, అక్టో 16

భారతరైల్వేశాఖ ఉపమంత్రి శ్రీ ఎస్. వి. రామస్వామి అధ్యక్షతన భారతరైల్వే శాఖాధికారుల ప్రతినిధి వర్గం ఒకటి నిన్న నేపాల్ రైల్వే అధికారులతో చర్చలు జరిపారు. భారత రైల్వేలఅవసరాలకు అనువుగా కలపను కొనే విషయం ఈ చర్చల్లో సమాలోచించబడింది.

నేపాల్ ఎంత కలప సప్లయిచేస్తే అంత కలపనూ భారతదేశం స్వీకరిస్తుందని తెలుస్తున్నది.

బెణుకు నొప్పిని పోగొట్టుకొండి ఇదుగో

అమృతాంజనము

అమృతాంజన్ అతిశీఘ్రంగా అమోఘంగా నివారణను కల్గిస్తూందంటే అందులో శమనాన్ని కల్గించే 10 రకాల ఔషధాలు కలసి ఉన్నాయి. నా జూకుగా ఉపయోగించవచ్చు. కాబట్టి ఒకే సీసా నెలల తరబడి వస్తుంది. 70 ఏళ్ళు ప్రసిద్ధి పొందిన నమ్మకమైన ఇంటి మందు కండల నొప్పులకు, తలనొప్పికి, గుండె జలుబు ఇతర నొప్పులు, జలుబులు బాధలకు అమోఘమైనది.

గాలిమార్పు సంసార తాపత్రయాలు నొప్పులు, జలుబులు ఇతర బాధలు కలిగిస్తాయి. ఇంట్లో ఎప్పుడూ అవసరానికి ఒక అమృతాంజన్ సీసా ఉంచండి.

అమృతాంజన్ 10 రకాల ఔషధాలు చేరిన మందు

అమృతాంజన్ నేడు అట్టపెట్టెలో వస్తూంది. సీసా 'అలూ'క్యాప్‌తో సీలు చేయబడి ఉంటుంది.

అమృతాంజన్ లిమిటెడ్

మద్రాసు - బొంబాయి - కలకత్తా - ఢిల్లీ

JWT-AM-2334

శోభకృత్‌నామ సం॥ అధికజ్యేష్ఠ॥ అమావాస్య రా 6-13 చిత్త పూర్తి ప వ 1-39 మొ: 3-25 వరకు (శాలివాహన శకము: 25-7-1885) 17-10-1963 గురు వారము

> "ఆత్మశానగమను లంతియ చుట్టుం బు లగ్గిం గలపి మరలు నఖిలమైన జ్ఞాతిజనము దీనిఁజర్చింప కందఱయందు మమతఁ బెనుచు నజ్ఞుఁ డనఘ."
>
> —భారతము (శాంతి)

గోలకొండపత్రిక

ఫోన్ నెం. 35280

17 అక్టోబరు 1963

గురు వారము

వరకట్న నిషేధము

—(o)—

ఇటీవల ఒక కళాశాలలో జరిగిన వరకట్న నిషేధ ప్రచారసభ వార్త పత్రికలలో ప్రకటితమైనది. వరకట్నపిశాచ నిర్మూలన కొరకు ప్రయత్నాలు జరుగడము, ప్రత్యేకించి కళాశాలలలో విద్యార్థుల సభలు నిర్వహించి వరకట్న దురాచారమునకు వ్యతిరేకముగా ప్రచారము జరుపడము ప్రశంసించదగిన విషయము. మనదేశములో రాజా రామ మోహన రాయలు, ఈశ్వర చంద్ర విద్యాసాగరులు, కందుకూరి వీరేశలింగము వంటి సంఘ సంస్కర్తలు బయలుదేరక ముందు అతి బాల్య వివాహాలు. విధవా వివాహ వ్యతిరేకత, కన్యాశుల్కము వంటి సాంఘిక దురాచారాలు మన సమాజమును యెంత క్రుంగదీసినవో యీనాడు వరకట్న దురాచారము నేటి మన సమాజాన్ని అంత వికలముజేసి విచ్ఛిన్న పరచుచున్నది. అతి బాల్య వివాహాలు విధవా వివాహ వ్యతిరేకత, కన్యాశుల్కమువంటి దుష్ట సాంప్రదాయాల కంటెను వరకట్న ఆచారము యెన్నో రెట్లు ఎక్కువక్లిష్టముగా తయారైనదని చెప్పవచ్చును.

రాజా రామ మోహన రాయలు, ఈశ్వరచంద్ర విద్యాసాగరులు, కందుకూరి వీరేశలింగము వంటి సంఘసంస్కర్తల సాంఘికోద్యమము, నిరంతర కృషి ఫలితముగా మన సమాజాన్ని పట్టుకొని పీడించుచున్న బాల్యవివాహాలు, కన్యాశుల్కము వంటి దురాచారాలు పూర్తిగా నిర్మూలింపబడినవి. కాని వరవిక్రయదురాచారము మాత్రము యింకను మన సమాజములో వ్రేళ్ళు దన్నుకొని యున్నది. ఈ వరకట్న దురాచారము రోజురోజుకు వివిధ రూపాలలో విజృంభించుచున్నది. కాని తగ్గుచున్న సూచనలు యెంతమాత్రమును కనుపించడములేదు. ఒక వైపున మన దేశములో ఆధునికత పెచ్చు పెరిగి పోవుచున్నది; పారిశ్రామిక, శాస్త్రీయ రంగాలలో అభివృద్ధి కనుపించుచున్నది; ఆశ్చర్యము కలిగించే పురోభివృద్ధిని సాధించిన పాశ్చాత్య రాజ్యాలతో మనకు దగ్గరి సంబంధాలు యేర్పడుచున్నవి. ఇంత జరిగినప్పటికిని మన దృష్టి విశాలమగుట లేదు; సంకుచితమైన మన ఆలోచనలు దినదినము మరింత కుంచించుకపోవుచున్నవి; కుళ్ళి కంపుకొడుతున్న నీచమైన, దుష్టమయిన ఆచారాలను యింకను మనము ఆశ్రయించుకొని యున్నాము. మనసమాజములో సమూలమైన మార్పులు రాకపోవడము మన దురదృష్టము.

"కన్యాశుల్కము" వంటి నాటకాలను ప్రదర్శించి మన వెనుక తరమువారి ఛాందసత్వమును, దురాచారాలను పరిహారము చేయడము మనకు అలవాటు; అంతేగాని యీనాటికిని మనము అనుసరించుచున్న దుష్ట సాంప్రదాయాలను మనము ఖండించలేము. అక్షరాస్యులు అధికమై, విద్యావంతుల సంఖ్య పెరిగి పోయినచో, స్త్రీలు విద్య అభ్యసించినచో సంఘము లోని దురాచారాల నిర్మూలన జరుగగలదని ప్రబలమైన విశ్వాసము. కాని మన సమాజములో వరకట్నాల విషయమున యిందుకు భిన్నముగా జరుగుచున్నది. బాలికలు బడులకు, కళాశాలలకు వెళ్ళి యెన్ని విద్యలు అభ్యసించినప్పటికిని వరకట్నమును యీయక తప్పటలేదు; చదువులతో పాటు వరకట్నాలు గూడ పెరిగి పోవుచున్నవి. యెంత చదువు అయినచో అంత వరకట్నమన్నది నినాదమువలె వినిపించుచున్నది. వరకట్న దురాచారమువలన మన సమాజములో యెన్నో సమస్యలు ఉత్పన్నమగుచున్నవి; యెన్నో కుటుంబాలు ఆర్థిక బాధలతో చితికి పోవుచున్నవి. ఈనాటికి గూడ యిటువంటి ఒక దురాచారము మన సమాజపు మూలుగులను పీల్చివేయడము నిజముగా మనకు సిగ్గుచేటు. వరకట్నమును నిషేధించుచు ప్రభుత్వము శాసనముచేసినది; అయితే శాసనము వలన యిటువంటి సాంఘిక దురాచారాల నిర్మూలన జరుగదు. ప్రజలలో సాంఘిక దురాచారాలకు వ్యతిరేకముగా తీవ్రమయిన ప్రచారము జరుగడము యెంతో ముఖ్యము.

నోటిలో కేన్సర్‌కు కారణాలు

న్యూఢిల్లీ, అక్టోబరు 16

పొగాకును సున్నాన్ని నములడం వల్ల నోటిలో కేన్సరు వ్యాధి సంభవిస్తుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ చేసిన పరిశోధనలవల్ల తేలింది.

ఆగ్నేయాశియాలోను భారతదేశములోను అరబ్ రాజ్యాల లీగ్ ప్రధానప్రతినిధి డా॥ క్లోవిస్ మక్సూద్, ఈనెల 14వ తేదీన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎకనమిక్సులో ప్రసంగించినప్పటి దృశ్యం.

అణ్వస్త్ర పరీక్షల పాక్షిక నిషేధ ఒడంబడిక:

చైనా 'వక్రబుద్ధి'పై ఇండియా దాడి

ఒడంబడిక రద్దయ్యే ప్రమాదం ఉందని శ్రీమతి విజయలక్ష్మి హెచ్చరిక

ఐక్యరాజ్యసమితి, అక్టోబరు 16

అణ్వస్త్ర పరీక్షల పాక్షిక నిషేధ ఒడంబడికపట్ల చైనా అవలంబిస్తున్న వక్రబుద్ధి సహితమైన ఆలోచనాధోరణిని ఇండియా తీవ్రంగా విమర్శిస్తూ, చైనా, ఫ్రాన్స్ దేశాల స్నేహితులు, సంబంధీకులూ, ఆ దేశాలు ఈ ఒడంబడికను ఆమోదించే విధంగా దౌత్యసంబంధమైన వత్తిడి తీసుకవస్తే తప్ప, అట్టి ఒడంబడిక రద్దు అయ్యే ప్రమాదం ఉందని ఇండియా హెచ్చరించినది.

అణ్వస్త్ర పరీక్షల నిషేధం అంశముపై ఇండియా అసెంబ్లీ ప్రధాన రాజకీయ సంఘంలో చర్చను ప్రతిపాదిస్తూ, ఇలా తెలియజేసినది. "అట్టి ఒడంబడికపై ప్రతికూల దేశాలు సంతకము చేయడానికి ఈ సంఘం వారిపై నైతికంగా వత్తిడి తీసుకరావాలని మేము గట్టిగా అభిప్రాయ పడుతున్నాము".

సంప్రదింపులు కొనసాగాలి

ఇండియా తరపున శ్రీమతి విజయలక్ష్మి పండిట్ ప్రసంగించారు. భూగర్భ పరీక్షలు నిషేధించేందుకు శీఘ్రగతిన ఒప్పందము చేసుకోవడానికి అణ్వస్త్ర రాజ్యాలు తమ సంప్రదింపులు కొనసాగించాలనికూడా శ్రీమతి పండిట్ విజ్ఞప్తి చేసింది.

భూగర్భ పరీక్షలు నిషేధించడానికి పరస్పర సర్దుబాట్ల ప్రాతిపదికపై సత్వరంగా ఒప్పందానికి చేరుకోవడానికి సంప్రదింపులు పునఃప్రారంభించాలని అణ్వస్త్రరాజ్యాలను, నిరాయుధీకరణ సంఘాన్ని కోరుతూ ఇండియామరియు జెనీవా నిరాయుధీకరణ సంఘంలోని ఇతర అలీన సభ్యదేశాలు ఒక ముసాయిదా తీర్మానాన్ని రూపొందించినది.

ఈ పాక్షిక నిషేధ ఒడంబడికను ఆమోదించి, దాని నిబంధనలను తు.చ. తప్పక కట్టుబడి ఉండవలసిందిగా ఈ తీర్మానం సమస్త దేశాలను కోరనున్నది.

ఈ వారంలో ఏదో ఒక రోజు ఈ తీర్మానం రాజకీయ సంఘంలో ప్రవేశపెట్టనున్నట్టు భావిస్తున్నారు.

భూగర్భ పరీక్షల నిషేధానికి విజ్ఞప్తి

ఫ్రాన్స్, చైనా దేశాలు ఈ ఒడంబడికను ఆమోదించాలని భూగర్భ పరీక్షల నిషేధానికి మరికొన్ని చర్యలు గయికొనవలసిన ఆవశ్యకతను గూర్చి అణ్వస్త్రేతర రాజ్యాల తరపున పెక్కుమంది వక్తలు ప్రసంగించారు.

ఫ్రాన్సు వైఖరిపట్ల విచారం

పాక్షిక ఒడంబడికపై ఫ్రాన్సుసంతకం చేయలేక పోతున్నందుకు శ్రీమతి పండిట్ విచారాన్ని వ్యక్తపరిచారు.

అణ్వస్త్రపరీక్షలను స్తంభింపజేయాలని 1954 ఏప్రిల్ మాసంలో ప్రధాని నెహ్రూ మొదటిసారిగా సూచించారనీ, అప్పటినుండి ఇండియా, ఐక్యరాజ్యసమితిలో నేమీ, ఇతరత్రా నేమీ పదేపదే అభ్యర్థిస్తూనే ఉన్నదనీ శ్రీమతి పండిట్ గుర్తుకు తెచ్చారు.

ఇండియా తీవ్రఆందోళన

మారణహోమంవైపు మానవజాతి తరవేగంతో వెళ్తున్నందున ఇండియా తీవ్రంగా ఆందోళన చెందడమే ఇండియా ప్రతిపాదనకు కారణమని చెప్పుతూ, అణ్వస్త్ర పరీక్షల నిషేధ ఒడంబడిక అమలులో లేనిపక్షంలో నిరాయుధీకరణకు సంబంధించిన ఇతర రంగాలలో నిజమైన ప్రగతి సాధించలేమని ఇండియా దృఢ విశ్వాసమని శ్రీమతి పండిట్ వెల్లడించారు.

పాక్షిక ఒడంబడిక ప్రయోజనాలు

మాస్కోలో జరిగిన పాక్షిక నిషేధ ఒడ బడికపై అమెరికా, సోవియట్ యూనియన్, బ్రిటన్‌లుసంతకాలుచేసినందుకు ఇండియా అభినందిస్తున్నదని తెల్పారు.

పెక్కు కారణాలదృష్ట్యా పాక్షిక నిషేధ ఒడంబడిక ముఖ్యమైనదని శ్రీమతి పండిట్ తెలిపారు. ఉద్రిక్త వాతావరణం ఉద్భవం కాకుండా నిరోధించడానికీ, అణ్వాయుధాల వ్యాప్తిని పరిమితం చేయడానికీ, మీదు మిక్కిలి సంపూర్ణ నిరాయుధీకరణ ఒప్పందానికి చేరుకోవడానికీ, మరికొన్ని ఒప్పందాలు కుదుర్చుకోవడానికీ మార్గాన్ని సుగమం చేసిందని శ్రీమతి పండిట్ పేర్కొన్నారు.

ఈ ఒడంబడిక కారణంగాప్రపంచం ఇప్పుడు ప్రశాంతంగా ఉండగలుగుతున్నదనీ, వంద ప్రభుత్వాలకుపైగా అట్టి ఒడంబడికను గుర్తించాయనీ, దానిపై ప్రప్రథమంగా ఇండియా సంతకము చేసిందని శ్రీమతి పండిట్ వివరించారు. ఈ ఒడంబడిక పట్ల అభ్యంతరాలు తెలుపుతూ పీపుల్స్‌రిపబ్లికు చైనా పక్షాక స్థాయికి వెళ్ళిందనీ, ప్రపంచ ప్రజలను మోసపుచ్చడానికి ఇది ఒక ఎత్తు అని చైనా విష ప్రచారాన్ని లేవదీసినదనీ, సోవియటు నాయకులను "మోసగాళ్లు"గా పేర్కొన్నదనీ శ్రీమతి విజయలక్ష్మి అన్నారు.

స్టీవెన్సన్ ఆశాభావం

సమస్త అణ్వస్త్ర పరీక్షల నిషేధ ఒడంబడిక సర్వత్రా పూర్తి కాగలదని తనకు రూఢి కలుగుతున్నదని అమెరికా ప్రధాన ప్రతినిధి శ్రీ అడ్లాయ్ స్టీవెన్సన్ అన్నారు.

భూగర్భ పరీక్షల నిషేధ అవశ్యకతకు సంబంధించి ఇండియా, ఐక్య అరబ్ రిపబ్లికు, సూడాన్ ప్రతినిధులు చేసిన ప్రకటనపట్ల ఆయన తమ ఆమోదాన్ని వ్యక్తపరిచారు.

మాస్కో అణ్వస్త్ర ఒడంబడికపై అన్ని దేశాలు సంతకము చేయగలవని తాను ఆశిస్తున్నట్లు స్టీవెన్సన్ తెలిపారు.

మెక్సికో హర్షం

రోదసిలో అణ్వాయుధాల పరీక్షలను నిలిపివేయాలని అమెరికా సోవియటు యూనియను వెల్లడించిన ఉద్దేశ్యాన్ని అభినందిస్తూ మెక్సికో నిన్న జనరల్ అసెంబ్లీ రాజకీయ సంఘానికి ఒక తీర్మానాన్ని సమర్పించినది. ఈ తీర్మానాన్ని ఏకగ్రీవముగా ఆమోదించాలని మెక్సికో ప్రతినిధి కోరినారు.

చర్చిల్ కుమార్తెకు స్పెయిన్ నుండి బహిష్కరణ

మలగా (స్పెయిన్), అక్టో 16

బ్రిటిష్ యుద్ధకాలప్రధాని సర్ విన్‌స్టన్ చర్చిల్ కుమార్తె సారా చర్చిలును స్పెయిన్ నుండి బహిష్కరిస్తూ ఉత్తర్వు చేయడానికి సిఫారసు జరిగినట్లు గవర్నరు కార్యాలయము గత రాత్రి ప్రకటించింది.

సారా చర్చిల్ మార్బెల్లాలో నివసిస్తున్నది. ఆమె తప్పతాగి మైకపు పరిస్థితిలో ఉంటున్నందువల్లను అసభ్యముగా ప్రవర్తించినందువల్లనూ ఆమెకు 5 వేల పెసెటాల జరిమానా విధించారు.

సారా చర్చిల్ భర్త లార్డు ఆస్లీ గత జులై 8న చనిపోయాడు.

అల్జీరియా సముద్ర పరిధి

12 మైళ్ళ వరకూ ఉన్నట్లు ప్రకటన

అల్జీర్స్, అక్టో 16

అల్జీరియాప్రాంతీయ సముద్రపరిధి 12 మైళ్ళ వరకూ ఉన్నదని గత రాత్రి ఒక ఉత్తర్వుద్వారా ప్రకటించబడింది.

కాగా విదేశీ నౌకలు ఏవైనా ఈ 12 మైళ్ళలోపు ప్రాంతంలోకి రావాలంటే అల్జీరియాప్రభుత్వఅనుమతి అవసరమనీ ఈ పరిధిలో చేపలు పట్టడము కేవలం అల్జీరియన్ల హక్కుమాత్రమే ననీ కూడా ఆ ప్రకటనలో ఉంది.

మహబూబ్‌నగర్ జిల్లా పోలీసు స్పోర్ట్సు

మహబూబ్‌నగరు, అక్టో 16

మహబూబ్‌నగర్ జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది ఇక్కడ జిల్లాపోలీసు స్పోర్ట్సు నిర్వహించారు. కలెక్టరు శ్రీ గులాందస్తగీర్ ఖురేషీ అధ్యక్షత వహించారు. వందలాది మంది ఈ స్పోర్ట్సును తిలకించారు. విజేతలకు శ్రీమతి సుజత్ సఫియుల్లా బహుమతులు ప్రదానం చేశారు.

అనంతపూరం లో వైద్యకళాశాల

జిల్లా పరిషత్తు భవనాలకు ప్రారంభోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రికి విజ్ఞప్తి

అనంతపూర్, అక్టో 16

రాష్ట్రంలో వ్యావసాయికోత్పత్తి నే కాక పారిశ్రామికోత్పత్తిని కూడా అధికంచేయడానికి జిల్లా పరిషత్తులు, పంచాయతి సమితులు ఇతోధిక కృషి చేయాల్సిందిగా ముఖ్యమంత్రి శ్రీ నీలం సంజీవరెడ్డి ఉద్బోధించారు.

అలా వ్యావసాయికోత్పత్తినీ పారిశ్రామికోత్పత్తినీ అధికం కావించడమే ఆంధ్రప్రదేశ్‌లో దారిద్ర్యనిర్మూలనకు మార్గమని ముఖ్యమంత్రి అన్నారు.

అనంతపూర్ జిల్లా పరిషత్తు నూతన కార్యాలయభవనాలకు ముఖ్యమంత్రి నిన్న శంకుస్థాపన కావించారు.

అనంతపూరులో వైద్యకళాశాల స్థాపించవలసిందిగా జిల్లాపరిషత్తు అధ్యక్షుడు శ్రీ నాగిరెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు.

అనంతపూరు జిల్లా స్టేడియమ్‌కు కూడా ముఖ్యమంత్రి శంకుస్థాపనోత్సవము జరిపారు. ఈ స్టేడియం నిర్మాణానికి గాను ధనసేకరణ కోసం ఒక రాఫిల్ నిర్వహించవలసిందిగా ఆయన సూచించారు.

అనంతపూరు బార్ అసోసియేషన్ వారు కూడా ముఖ్యమంత్రికి స్వాగత పత్రం సమర్పించారు. దేశప్రగతిపట్ల శ్రద్ధాసక్తులతో వ్యవహరించాల్సిందిగా ఆయన ఈ సందర్భంగా ప్రబోధించారు.

ప్రిన్స్ సౌవన్న ఫౌమా లండన్ రాక

లండన్, అక్టోబరు 16

బ్రిటిష్ విదేశాంగ శాఖ మంత్రి లార్డుహోతో చర్చల నిమిత్తం నాల్గు దినాల పర్యటనపై లావోస్ తటస్థవాద ప్రధాని ప్రిన్స్ సౌవన్న ఫౌమా నిన్న యిక్కడికివచ్చారు.

లావోస్‌కు తిరిగి వెళ్ళిన తర్వాత పరిస్థితి ఎలా ఉంటుందనుకుంటున్నారన్న ప్రశ్నకు ప్రిన్స్ సౌవన్న ఫౌమా జవాబిస్తూ అంతా రష్యా చైనాలమీద ఆధారపడి ఉంటుందన్నారు. లావోస్ ప్రజలు తమ వ్యవహారాలు తామే చూసుకొనే పరిస్థితికి వదలాలని రష్యా అనుకున్నట్లయితే పరిష్కారం తేలికగా లభిస్తుందని ప్రిన్స్ సౌవన్న ఫౌమా అన్నారు.

లండన్ నుండి సౌవన్న ఫౌమా మాస్కోమీదుగా వియంటైన్ చేరుతాడు. మాస్కోలో ఆయన కృశ్చేవ్‌తో చర్చలు జరుపుతాడు. లండన్ చర్చలఅనంతరం సౌవన్న ఫౌమా నేరుగా ప్యారిస్ వెళ్ళి అక్కడినుండి 29వ తేదీన మాస్కో చేర్తారట.

మాస్కోలో చర్చల అనంతరము సౌవన్న ఫౌమా భారత దేశానికి, కాంబోడియాకు కూడా వెళ్ళి అక్కడి నుండి వియన్‌టైన్ చేర్తాడని తెలుస్తున్నది.

సమితికి 30 లక్షల డాలర్ల భారతవిరాళం

న్యూయార్కు, అక్టోబరు 16

ఐక్యరాజ్య సమితి ప్రత్యేక నిధికి, సాంకేతిక సహాయతా కార్యక్రమ విస్తరణకుగాను మూడు మిలియన్ డాలర్ల ధనాన్ని ఇవ్వడానికి భారత దేశము సంసిద్ధతను తెలిపింది.

భారత దేశ విరాళాన్ని నిన్న భారత ప్రతినిధి శ్రీ బి. ఎన్. చక్రవర్తి ప్రకటించారు.

భారత దేశానికి ఆర్థిక ఇబ్బందులు ఎన్నిఉన్నప్పటికీ ఐక్యరాజ్య సమితి కార్యక్రమాలకై ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నదనీ కాబట్టి సమితికి మునుపటివలె తన వాటా విరాళం తాను ఇవ్వగలదనీ శ్రీ చక్రవర్తి వివరించారు.

భారత ప్రభుత్వం ఇవ్వ సిద్ధపడిన విరాళంలో 2.15 మిలియన్ డాలర్లు ప్రత్యేక నిధికి మిగిలిన మొత్తం సాంకేతిక సహాయ విస్తరణ కార్యక్రమాలకు చెందుతుంది.

నిన్నటి సమావేశంలో ఐక్యరాజ్య సమితి కార్యదర్శి ఉథాంట్ సభ్య రాజ్యాలన్నీ 1964లో ఐక్యరాజ్య సమితి సహాయతా కార్యక్రమాలకు తగు రీతిని సాయపడుతూ విరాళాలివ్వాలని కోరారు.

సమితి ప్రత్యేకనిధికి, సాంకేతిక సహాయ విస్తరణ కార్యక్రమానికిగాను 150 డాలర్లు అవసరమౌతాయని 1964 అంచనాల్లో తేల్చారు.

ఇండియన్ అండ్ ఫారిన్ రివ్యూ

ప్రచురణల విభాగంచే కొత్త పక్ష పత్రిక ప్రచురణ

న్యూఢిల్లీ, అక్టో 16

రేడియో, సమాచార మంత్రిత్వశాఖకు చెందిన ప్రచురణల విభాగం "ఇండియన్ అండ్ ఫారిన్ రివ్యూ" అనే కొత్త పక్షపత్రిక మొదటి సంచిక ప్రచురించింది. ఈసంచికలో కొలంబో ప్రతిపాదనలపట్ల చైనా వైఖరి, దక్షిణాఫ్రికా జాతివివక్ష విధానం, పోర్చుగీసు వారి వలసతత్వంపట్ల విధించవలసిన ఆంక్షలు, సిరియాంగులో ముస్లిం ప్రజల తిరుగుబాటు, తూర్పుపాకిస్తాన్ నుండి భారతదేశంలోకి పాకిస్తానీయుల అక్రమ ప్రవేశంవంటి విషయాలపై వ్రాసిన వ్యాసాలు చేర్చారు.

ఇందులో ఇండోనీషియాలో జాతీయ సమైక్యతా సాధనను గురించి; ఇండోనీషియాలో తమ ఇటీవలి పర్యటన అనుభవాలను గురించి డాక్టర్ వి.కె ఆర్.వి. రావు వ్రాసినవ్యాసము, మలేషియా సమాఖ్య, అణ్వస్త్రఆయుధాల నిషేధంపై ఒప్పందముపట్లచైనా ప్రభుత్వవైఖరిపట్ల ఇతర అనేక విషయాలపై వివిధ వ్యాసాలు కూడా ఉన్నాయి.

ప్రతినెల 1 వ తేదీన, 15 వ తేదీన విడుదల అయ్యే ఈ పక్ష పత్రికలో గ్రంథ సమీక్షలు, అంతర్జాతీయ విషయాలపై భారత దేశములో పత్రికల అభిప్రాయాలు వ్యాఖ్యలో ప్రచురిస్తారు.

దక్షిణ కొరియా అధ్యక్షత

సియోల్, అక్టోబరు 16

దక్షిణ కొరియా సైనిక పాలక మండలి అధ్యక్షుడు జనరల్ పార్కు చాంగుహీ ఈ వేళ దక్షిణ కొరియా రిపబ్లికు అధ్యక్షుడుగా ఎన్నుకోబడ్డాడు.

చేనేతోద్యమ ప్రముఖుల సమావేశము

హైదరాబాదు, అక్టో 16

ఆంధ్రప్రదేశ్‌లోని రెండు కేంద్ర చేనేత సహకార సంఘాల కార్యవర్గ సభ్యులు, చీరాల, గుంటకల్లు నేత సహకార నూలుమిల్లుల కార్యవర్గసభ్యులు ఆంధ్రప్రదేశ్ చేనేత సహకార మండలి సభ్యులు, ఆంధ్ర తెలంగాణాల లోని ప్రాంతీయ చేనేత కాంగ్రెసు కార్యవర్గ సభ్యులు తదితర ప్రముఖులు చేనేత వర్గమునకు చెందిన వారి సమావేశము యీనెల 20వ తేదీన పగలు 8 గంటలకు శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీగారి గృహములో జరుగచలదు.

అవతార్ మెహర్బాబా కేంద్ర ప్రారంభం

అందోలు, అక్టోబరు 16

అందోలుగ్రామములోని శ్రీరామాలయంలో జరిగినసభలో అందోలు సబ్ రెజిస్ట్రారాఫీసరు శ్రీ చాగంటి సుబ్బారావుచే అవతార్ మెహర్బాబా కేంద్ర ప్రారంభోత్సవము ఈనెల 10వ తేదీన జరుపబడినది, పలువురు వుర ప్రముఖులు సభ్యులైరి. శ్రీ చిదిరె లక్ష్మణ శాస్త్రి కార్యదర్శిగ ఎన్నుకొనబడిరి.

చైనాపల్ల రష్యాకు ప్రమాదం

1955లోనే కృశ్చేవ్ అడినోవర్‌తో అన్నాడట

బాన్, అక్టోబరు 16

ఐరోపా ఉమ్మడి విపణిలో బ్రిటన్ చేరడానికి నిరోధించింది ప్రెసిడెంట్ డిగాల్ కాదనీ మాక్మిలన్-బ్రిటిష్ ప్రధాని- ప్యారిస్ ఆగమగమేననీ డా॥ అడినోవర్ గతరాత్రి అన్నారు. మాక్మిలన్ ప్యారిస్‌కు వచ్చినప్పుడు ప్రధానముగా అణ్వస్త్ర పరీక్షల్ని గురించి మాట్లాడారు.

ఈ విషయం ప్రెసిడెంట్ డిగాల్ జనవరి 14నాడు అధ్యక్షుని విలేఖరుల గోష్ఠి ముగిసిన అనంతరం తెలియజేసినట్లు అడినోవర్ అన్నాడు.

డా॥ అడినోవర్ నిన్న ఒక టెలివిజన్ ఇంటర్వ్యూలో ఒక ప్రశ్నకు జవాబిస్తూ 1958లోనే కృశ్చేవ్ తనతో మాట్లాడుతూ రష్యాకు చైనా వర్తమాదకారిగా ఉందని ప్రస్తావించినట్లు వెల్లడించారు.

కాంగ్రెసు పార్లమెంటరీ పార్టీ

80వ తేదీన కార్యవర్గ సమావేశం

న్యూఢిల్లీ, అక్టోబరు 16

ప్రభుత్వపిప్పింగ్ ఋణవిధానాన్నీ, విదేశీనాణాల్లో పబ్లిక్ లా 480 ప్రకారం అమెరికానుండిగోధుమను తెప్పించే విషయం గురించీ చర్చించేందుకు కాంగ్రెసు పార్లమెంటరీపార్టీ కార్యవర్గం అక్టోబరు 30న సమావేశమౌతుంది.

పార్టీ కార్యదర్శి శ్రీ రఘునాథ సింగ్ అందజేసేపత్రం ఈ విషయంలో సమీక్షించబడుతుంది.

ప్రతి దిగుమతుల సమస్య కూడా చర్చకురాగలదని తెలుస్తున్నది. భారత వస్త్రపరిశ్రమ మీద, దేశంలో నూలు ధరమీద దాని ప్రభావాన్ని గురించి కూడా యీ సమావేశంలో చర్చలు జరుగుతాయి.

లారీ బోల్తాపడి ఒకరి మృతి

(గోలకొండ పత్రిక విలేఖరి)

జోగిపేట, అక్టో 16

